ఉపాధి పనులపై నిఘా ఏది?



మారమునగాల-1లో తీర్మానం లేకుండానే జీపీ బిల్డింగ్‌కు భూమిపూజ (ఫైల్)

- భవన నిర్మాణాలకు తీర్మానాలు లేకుండానే పనుల ప్రారంభం
- టీఏలు లేక నిధులు పక్కదారి
- పాత పనులే పూర్తి చేసిన వైనం

ఉండవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు పేర్కొంటుంది. ఈ నేపథ్యంలో ఇటీవల పనుల జాతర కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. కానీ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో కొత్త పనులు చేపట్టడం లేదని పాత పనులు మమా అనిపిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పనుల జాతరలో చేపట్టాల్సిన పనులు

పనుల జాతరలో ఇందిరా మహిళా శక్తి మహిళలకు ఉపాధి కల్పన పనులు, పొలాలకు బాటల నిర్మాణం, ఫలవనాలు, జలనిధి కింద నీటి సంరక్షణ, భూగర్భ జలాలు పెంచే పనులు చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. ఇంకుడు గుంతల నిర్మాణం, గ్రామీణ మౌలిక వసతుల కల్పన, జీపీ, అంగన్‌వాడీ భవనాలు, సీసీరోడ్ల నిర్మాణాలు, పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పల్లెలో ఉపాధి కల్పన కోసమే పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు నాయకులు పేర్కొన్నారు.

పనులు పాతవే

మండలంలో ఇంకుడు గుంతల నిర్మాణాలు అధికంగా నిర్మించారు. దాదాపు 21కి పైగా నిర్మాణాలు జరగడంతో పశువుల షెడ్డు నిర్మాణాలపై పట్టింపు లేకుండా పోయింది. 15 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పాత పనులు ఇంకుడు గుంతలు, భూగర్భజలాలు పెంచే గుంతలు, సీసీరోడ్ల నిర్మాణాలు కొత్తగా జరిగినట్లు ఉపాధి అధికారులు చూయించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దాదాపు రూ.5 లక్షలకు పైగా పనులు జరిగినట్లు అధికారులు తెలిపారు. కానీ ఎమ్మెల్యే ప్రారంభించిన పనులు మాత్రం చేపట్టలేదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.



ఉండవెల్లిలో పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు(ఫైల్)

తీర్మానాలు లేకుండానే

అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు ఎలాంటి తీర్మానాలు లేకుండానే పనులు ప్రారంభించారు. మారమునగాల-1, ప్రాగటూరు, శేరుపల్లె గ్రామాల్లో పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు ఎలాంటి తీర్మానం ఆన్‌లైన్‌లో నమోదు లేకపోయిన పనుల జాతరలో భూమి పూజ చేశా రు. కొత్త పనులు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా పాతవే చూపించి పూర్తయినట్లు మంజూరు చేస్తున్నారు. పొలం బాట పనులు చేపట్టలేదని రైతులు పేర్కొంటున్నారు. రైతుల కోసం అన్ని పనులు చేశామని అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు లేని పరిస్థితి

మండలంలో సమయపాలన పాటించని అధికారులు కార్యాలయాలకు ఉదయం 11.30 గంటలకు చేరుకుంటున్నారు. ఫీల్డ్‌కు కూడా పోని పరిస్థితి నెలకొంది. టీఏలు లేక ఎఫ్ఏల పనితీరు పక్కన పెట్టేశారు. ఉపాధి హామీ పథకం కింద రూ.6 వేలు ఇస్తున్న ప్రభుత్వం, దానికి కొందరు రూ.వెయ్యి వసూలు చేస్తున్నారని కూలీలు ఆరోపిస్తున్నారు. అధికారుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే గొడవలకు దిగుతున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనుల జాతరలో చేపట్టిన పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్తాం..

పనుల జాతరలో మండలంలో చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తాం. పాత పనులే పూర్తి చేశారా, కొత్త పనులు చేపట్టారన్నా విషయంపై చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్తాం.

– తిరుపతన్న, ఎంపీడీఓ, ఉండవెల్లి

క్లుప్తంగా

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం



శాంతినగర్: స్థానిక రాఘవేంద్ర పాఠశాలలో చదువుతున్న చరిత అనే విద్యార్థికి ఆరోగ్యం విషమించిందని, ఆర్థికసాయం అందించాలని కుటుంబ సభ్యులు సామాజిక మాధ్యమాల్లో కోరారు. ఈ నేపథ్యంలో స్పందించిన జూలెకల్‌కు చెందిన యువకులు వారి వంతుగా రూ.27,200 పోగుచేసి విద్యార్థి కుటుంబానికి అందజేసి ఉదారత చాటుకున్నారు. శాంతినగర్‌లో చరిత కుటుంబ సభ్యులకు మంగళవారం నగదు అందజేశారు.

హైమాస్ట్ లైట్లకు మరమ్మతు



అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు కొన్ని రోజుల నుంచి వెలగడం లేదు. స్థానికుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు ఆదేశానుసారం మంగళవారం మున్సిపల్ సిబ్బంది హైమాస్ట్ లైట్లకు మరమ్మతు చేశారు.

మద్యం మత్తులో యువకుల హల్‌చల్



ధరూరు: రాయచూర్‌కు చెందిన యువకులు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు సందర్శనకు వచ్చి మద్యం మత్తులో కారులో వెళ్తూ మరో కారును ఢీ కొట్టిన సంఘటన మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో మంగళవారం జరిగింది. రాయచూరుకు చెందిన వీరేష్ స్నేహితులతో కలిసి జూరాల ప్రాజెక్ట్‌కు వద్దకు వచ్చారు. అక్కడ మద్యం తాగి తిరుగు ప్రయాణంలో రాయచూర్‌కు వెళ్తున్న సమయంలో గద్వాల వైపు వెళ్తున్న ధరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి కారును ఢీ కొట్టారు. దీంతో కారు స్వల్పంగా దెబ్బతింది. అనంతరం కారు ఆపకుండా యువకులు వెళ్తుండగా గ్రామస్తులు అడ్డగించి పట్టుకున్నట్లు స్థానికులు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ధరూరు: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. మండల పరిధిలోని జీరబండ, రేవులపల్లి పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అదే విధంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా వడ్డించాలని ఏజెన్సీ సభ్యులకు సూచించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ఎర్రవల్లి: అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. బాలానగర్ మండలం కేతిరెడ్డిపల్లిలో కొందరు దుండగులు పనిగట్టుకొని అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని మండిపడ్డారు. విగ్రహాలను కూల్చడం హేయమైన చర్య అని ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాముడు, శాంతిరాజు, రామారావు, అంజి పాల్గొన్నారు.

కార్మికులకు జియో ట్యాగింగ్

గట్టు: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు నూతన జియో ట్యాగింగ్ నంబర్లు అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ఇన్నాళ్లుగా చేనేత వృత్తిపై జీవనం సాగిస్తున్న కార్మికులు ఇబ్బందులు పడినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీరన్న, కార్మికులు మోహన్, మౌలాలి, బుద్దన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు తొలగింపుపై హర్షం



ఇటిక్యాలలో రోడ్డుపై నిలిచిన మురుగు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



సాతర్లలో బోరు మోటార్ పనులు పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఇటిక్యాల: రోడ్లపై పారుతున్న మురుగుపై మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి అధికారులు వెంటనే స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో కలసి మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో రోడ్లపై నిలిచిన మురుగు తొలగించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసిన 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

మోటార్‌కు మరమ్మతు

ఇటిక్యాల: సోమవారం సాక్షి దినపత్రికలో 'తాగు నీటి తంటాలు' కథనం ప్రచురణకు అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఏఈ నవీన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వీరేష్ బాబు మంగళవారం సాతర్ల గ్రామంలో పాడైపోయిన బోరు మోటార్ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

భాషాభివృద్ధికి కాళోజీ సేవలు చిరస్మరణీయం



జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



ఇటిక్యాలలో కాళోజీకి నివాళులర్పిస్తున్న అధికారులు

సాక్షి నెట్‌వర్క్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు కాళోజీకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని స్మృతివనంలో 1969 ఉద్యమకారుల సంఘం, సీనియర్ సిటిజన్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు చేశారు. తన రచనల ద్వారా ప్రజలను చైతన్యం కల్పించిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు అని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణలో భాషలు, మాండలికాల అభివృద్ధికి కాళోజీ చేసిన సేవలు మరువలేనివన్నారు. తెలంగాణ భాషా ఉద్యమంలో ఆయన పాత్ర ఎనలేనిదన్నారు. ఈ సందర్భంగా పలువురు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తొలి కాళోజీ పురస్కార గ్రహీత డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరభద్రప్ప, తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ, తహసీల్దార్ ప్రభాకర్ ప్రిన్సిపాల్ రమా ఓబులేష్, ప్రిన్సిపాల్ కృష్ణ, ప్రిన్సిపాల్ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

15న ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడలు

ధరూరు: ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడలు ఈ నెల 15న మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ రవీంద్రబాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మండలంలోని ఆయా ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఎస్‌జీఎఫ్ అండర్- 14, అండర్- 17 విభాగాల్లో బాలబాలికలను ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు టోర్నమెంట్ సెలక్షన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే అండర్- 14 విభాగంలో పాల్గొనే విద్యార్థులు జనవరి 1, 2012లోపు ఉన్న వారు అర్హులని, అండర్- 17 విభాగంలో పాల్గొనే విద్యార్థులు జనవరి 1, 2009 లోపు వయస్సు వారు అర్హులని తెలిపారు. పాల్గొనే విద్యార్థులు ఆధార్ జిరాక్స్ తీసుకొని హాజరుకావాలని పేర్కొన్నారు.

దేశ సేవ కోసం బీజేపీ పిలుపునిస్తోంది



మాట్లాడుతున్న రామాంజనేయులు

అయిజ: యువత, మేధావులు దేశ సేవ చేసేందుకు బీజేపీ పిలుపునిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని బీజేపీ కార్యాలయంలో సేవా పక్షం-2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. దేశ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో సేవ పక్షం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 17న అన్ని మున్సిపాలిటీల్లో రక్తదాన శిబిరం నిర్వహించాలని, ప్రతి శిబిరంలో కనీసం 75 యూనిట్ల రక్తం సేకరించాలన్నారు. అదే విధంగా 18వ తేదీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆత్మ నిర్భర భారత్, వికసిత్ భారత్ అంశాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించాలన్నారు. యువతను, విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదన్న, వెంకటేష్, లక్ష్మణాచారి, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య మరింత పెంచాలి



మాట్లాడుతున్న డాక్టర్ సర్వ్యాపరాణి

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింత పెంచాలని డాక్టర్ స్వరూపరాణి వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణి, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్య మహిళపై వైద్య సిబ్బంది గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా గర్భిణులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింత పెంచాల్సిన అవసరం వైద్య సిబ్బందిపై ఉందన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, వెంకటస్వామి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి



ఎర్రవల్లి: గొర్రెలు, మేకల్లో వచ్చే పారుడు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్య అధికారి డాక్టర్ భువనేశ్వరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు కోదండాపురం, ధర్మవరం గ్రామాల్లో జీవాలకు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం చేపట్టారు. మర్బిల్లి వైరస్ ద్వారా సంభవించే పారుడు వ్యాధి అనతికాలంలోనే మందలోని అన్ని జీవాలకు వేగంగా వ్యాపిస్తుందన్నారు. గొర్రెల కంటే మేకల్లో వ్యాధి తీవ్రత అధికమవ్వడంతో పాటు మరణాల తీవ్రత కూడా ఎక్కువగానే ఉంటుందన్నారు. వ్యాధి నివారణకు ముందస్తుగా టీకాలు వేసి సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వినయ్, సిబ్బంది దేవన్న, భాస్కర్, శ్రీరాములు, గోపాలమిత్ర సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్‌కు బాటలు పడాలి

గట్టు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ చెన్నయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులు అమానుషం



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అలంపూర్: న్యాయవాదులపై దాడులకు పాల్పడటం అమానుషమని అలంపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గవ్వల శ్రీనివాసులు అన్నారు. మేడ్చల్ బార్ అసోసియేషన్ సభ్యుడు సురేశ్‌బాబు, నల్లగొండ జిల్లాకు చెందిన వడ్డేపల్లి వెంకటయ్యపై ఇటీవల జరిగిన దాడులను ఖండిస్తూ.. మంగళవారం అలంపూర్ జూనియర్ సివిల్‌కోర్టు ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయం కోసం పోరాడే న్యాయవాదులపై భౌతిక దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని అన్నారు. న్యాయవాదులపై దాడులకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తిమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, శ్రీధర్‌రెడ్డి, నాగరాజు యాదవ్, గజేంద్రగౌడ్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

చదువు మానేస్తే భవిష్యత్ ఆగం



తూర్పుగార్లపాడులో మాట్లాడుతున్న చైల్డ్ వెల్ఫేర్ ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి

రాజోళి: చదువు మధ్యలో మానేస్తే భవిష్యత్ ఆగమవుతుందని చైల్డ్ వెల్ఫేర్ ఓఆర్ డబ్ల్యూ లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని తూర్పుగార్లపాడులో గ్రామస్థాయి బాలల సంరక్షణ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5 తరగతి పూర్తయిన వెంటనే చాలా మంది పిల్లలను బడి మాన్పించి పనులకు తీసుకెళ్తున్నారన్నారు. బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలని సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాజా మెయినుద్దీన్, పంచాయతీ సెక్రటరీ ఖలీల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలి

ధరూరు: బాలలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని జిల్లా బాలల సంరక్షణ కౌన్సిలర్ నర్సింహులు అన్నారు. బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పారుచర్లలో స్త్రీ,శిశు సంక్షేమ బాలల పరి రక్షణ కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి సురేష్, సూపర్‌వైజర్ సునీతమ్మ, కార్యదర్శి మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

ఇటిక్యాల: మండల పరిధిలోని గోపల్‌దిన్నేలో మంగళవారం బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ నవీన్ బాలల హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాఘవేంద్రరెడ్డి, కార్యదర్శి రామకృష్ణ, ఏఎస్‌ఎం మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కాంప్లెక్స్ జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి

ధరూరు: కృత్రిమ మేధస్సుపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కాంప్లెక్స్ జీహెచ్‌ఎం ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాజరైన కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు విధిగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను నేర్చుకొని విద్యార్థులకు బోధించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ప్రకాష్, సీఆర్పీ నర్సింహులు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని అధికారులు



నెట్టెంపాడులో ఊరబావిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ధరూరు: ప్రత్యేక పాలనలో అధికారులు ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా నాయకులు ఆరోపించారు. మంగళవారం మండల పరిధిలోని నెట్టెంపాడు, నాగర్‌దొడ్డి గ్రామాల్లో వారు పర్యటించారు. ప్రధానంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా ఉన్నాయని, దీని ఫలితంగా 14 మూగజీవాలు ప్రాణాలు కోల్పోయాయన్నా రు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ పక్కన ఉన్న ఊరబావి ప్రమాదభరితంగా ఉందన్నారు. గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై సర్వే నిర్వహించారు. సుమారు 40 మంది వృద్ధాప్య, దివ్యాంగులు పింఛన్ కోసం అర్హత ఉందని, అయినా వారికి పింఛన్ మంజూరు చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నాయకులు మేకల నర్సింహులు, దేవదాసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బాధ్యత ఉపాధ్యాయులదే



ఇటిక్యాలలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న అధికారులు

అలంపూర్/ఇటిక్యాల/ఎర్రవల్లి: తరగతి గదిలో విద్యార్థుల బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంఈఓలు రామకృష్ణ, శివప్రసాద్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని వైష్ణవి పాఠశాలలో ఉండవెల్లి మండల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులు శాలిని, జయశంకర్‌రెడ్డి, శ్యాంసన్, శ్రీరాము, జనార్దన్, మద్దిలేటిని శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అదే విధంగా పదోన్నతులు, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు.

- ఇటిక్యాల మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయుల వృత్తి పవిత్రమైందని పేర్కొన్నారు. ఎర్రవల్లి ఎంఈఓ అమీర్‌పాష, కాంప్లెక్స్ హెచ్‌ఎం పాగుంటన్న, ఉపాధ్యాయులు భాస్కర్, రెడ్డినాయక్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.
- ఎర్రవల్లి మండల పరిధిలోని దువాసిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్థర్, బాలకృష్ణ, మల్లేశ్వరి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



అలంపూర్ చౌరస్తాలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఎర్రవల్లి మండలం దువాసిపల్లిలో హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు